సాక్షి వికారాబాద్

ఆదివారం । 21 । జులై । 2024



దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

దొంగనోట్లు చలామణి చేస్తున్న ముఠా నుంచి రూ.7.95 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. 8లో▸



సత్తా చాటుతాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి విజయరామారావు ధీమా వ్యక్తంచేశారు. 8లో▸



జ్వరం.. జరభద్రం

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. 9లో▸

రేపు కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

కొడంగల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : కొడంగల్
కమిషనర్ : బలరాం నాయక్
తేదీ : 22-7-2024 (సోమవారం)
సమయం : మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
74165 95493, 83099 57839

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి



పూడూరు: రైతు రుణ మాఫీ డబ్బులు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తుంటారని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వివిధ బ్యాంకుల లోగోలతో వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పంపి మోసాలకు పాల్పడుతారని తెలిపారు. అలాంటి మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. అపరిచిత వ్యక్తులు, ఫోన్ల నంబర్ల నుంచి అనుమానిత మెసేజ్‌లు వస్తే వెంటనే సంబంధిత పీఎస్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. పరిచయం లేని వారు చేసే వాట్సాప్ మెసేజ్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. తెలియని లింక్‌లను ఓపెన్ చేయడం ద్వారా బ్యాంక్ ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సెల్‌ఫోన్ వినియోగదారులు బ్లూ కలర్ లింకులను, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయరాదన్నారు.

నేడు పెరుగుబసంతం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో ఆషాఢ మాస చిన్నజాతరను పురస్కరించుకొని ఆదివారం పెరుగుబసంతం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామి వారి గరుడ వాహన సేవ, అనంతరం పెరుగుబసంతం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

కేశవరావుకు టీఆర్ఆర్ శుభాకాంక్షలు



కేశవరావుకు బొకే అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ సలహాదారులుగా శనివారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన కే.కేశవరావును పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిగి ప్రాంత అభివృద్ధిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి చర్చించారు.

నాడు పాలన బాట నేడు జీవన వేట



ధారూరు: దోర్నాల్ తండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు(ఫైల్)

సండే స్పెషల్

గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే (సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు) కీలకం. కొంతమంది తమ పదవికే వన్నె తెచ్చి ఆదర్శంగా నిలిచారు. మరి కొందరు వారి ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేశారు. జనాలతో మమేకమై బిజీగా గడిపారు. ఇటీవలే వారి ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో కుటుంబ పోషణపై దృష్టి సారించారు. సొంత ఊరిలో పొలం పనులు, ఇతర వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పదవీ కాలం ముగిసిన మాజీ ప్రజాప్రతినిధుల జీవనశైలిపై సాక్షి ప్రత్యేక కథనాలు..



వృత్తి వైపు పయనం

దోమ మండలం ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన వెంకటనర్సమ్మ వృత్తి రీత్యా నర్సు.. ఆరు నెలల క్రితం వరకు సర్పంచ్‌గా గ్రామంలో ఎన్నో మంచి పనులు చేశారు. ప్రజల మన్ననలు పొందారు. సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆమె తెలిపారు. గ్రామాభివృద్ధిలో తన పాత్ర ఉండటం దేవుడిచ్చిన వరంగా భావిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరో సారి అవకాశం వస్తే ప్రజలకు గుర్తుండిపోయే పనులు చేసి ఆదర్శంగా నిలుస్తానని తెలిపారు. పదవీ కాలం ముగియడంతో తన వృత్తిపై దృష్టి సారించారు. పరిగి పట్టణంలో ఓ డాక్టర్ వద్ద నర్సుగా పని చేస్తోంది. ప్రజలకు వైద్యం చేయడం కూడా సంతృప్తి నిస్తుందని అన్నారు. – దోమ

పొలం పనుల్లో వీరప్ప



పెద్దేముల్ మండలం గాజీపూర్‌కు చెందిన వీరప్ప మాజీ సర్పంచ్. పదవీ కాలం పూర్తి కావడంతో పొలం బాట పట్టాడు. సర్పంచ్‌గా ఉన్నన్ని రోజులు గ్రామాభివృద్ధికే పాటుపడినట్లు చెప్పారు. దాదాపు రూ.10లక్షలు అప్పు చేసి వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బిల్లులు రాలేదని పేర్కొన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి మళ్లీ పొలం పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. రైతు అనిచెప్పుకోవడం ఎంతో గర్వంగా ఉంటుందన్నారు. పదవి అనేది తాత్కాలికం.. ఉన్నన్ని రోజులు ప్రజలతో సఖ్యతగా మెలగాలి. వారికి సేవ చేస్తే ఎప్పటికీ మరచిపోరు. సొంత ఊరిని అభివృద్ధి చేసుకోవడానికి నాకు ఒక అవకాశం వచ్చింది. అది నా అదృష్టంగా భావిస్తా. – పెద్దేముల్

చికెన్ వ్యాపారిగా ప్రవీణ్



పరిగి మండలం యాబాజిగూడకు చెందిన ప్రవీణ్ ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఆరు నెలల క్రితం పదవీ కాలం ముగియడంతో గ్రామంలో చికెన్ సెంటర్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని తెలిపారు. మళ్లీ ఎన్నికలు వస్తే పోటీలో ఉంటానని తెలిపారు. – పరిగి

టీ స్టాల్ యజమానిగా..

కుల్కచర్ల మండలం దాస్యనాయక్ తండాకు చెందిన జీ శంకర్ నాయక్ 2019లో జరిగిన స్థానిక ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. అనంతరం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా కూడా కొనసాగారు.. ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేశారు. పదవీ కాలం ముగియడంతో వ్యాపారంపై దృష్టి సారించారు. మోడల్ టీ స్టాల్ ఏర్పాటు చేసి జీవనం సాగిస్తున్నారు. సర్పంచ్ పదవి ఎంతో అమూల్యమైనదిని.. ఇది అందరికీ దక్కే అవకాశం కాదన్నారు. తండాలకు ఆదాయ వనరులు తక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వాలు ఇచ్చే నిధులతోనే గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల సహకారం ఎప్పటికీ మరచిపోలేనని పేర్కొన్నారు. మరోసారి అవకాశం వస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకుంటానని తెలిపారు. – కుల్కచర్ల





కార్పెంటర్ అనంతయ్య

దుద్యాల్ మండలం లగచెర్ల గ్రామానికి చెందిన మాదారం అనంతయ్య 2019లో సర్పంచ్ పదవి చేపట్టారు. ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉంచి సేవ చేశారు. తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో సమస్యలు తలెత్తకుండా చూశానని చెప్పారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధి కోసం సొంత నిధులు ఖర్చు చేశానని, ఇందుకు సంబంధించిన బిల్లులు రాలేదని తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలనతో ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సొంత వృత్తి (కార్పెంటర్) చేసుకోవడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. – దుద్యాల్

వ్యవసాయమే జీవనాధారం



బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ బర్కత్‌పల్లి నర్సింలు వ్యవసాయ పనులపై దృష్టి సారించారు. ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేశారు. తనను ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని తెలిపారు. వారి రుణం తీర్చుకునేందుకు కృషి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం తనకున్న పొలంలో కంది పంట సాగు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయమే తనకు జీవనాధారమని తెలిపారు. – బంట్వారం

దాబా నిర్వహణలో మాజీ ఎంపీపీ



కందుకూరు ఎంపీపీగా ఐదేళ్లు సమర్థవంతంగా పని చేసిన తిమ్మాపూర్‌కు చెందిన మంద జ్యోతి పదవీ కాలం పూర్తి కావడంతో భర్తతో కలిసి వ్యాపారంపై దృష్టి సారించారు. శ్రీశైలం హైవేపై పెద్దమ్మతల్లి దేవాలయం ఎదుట దాబా ఏర్పాటు చేసుకుని బిజీగా మారారు. అవసరాన్ని బట్టి వంట పనులు కూడా స్వయంగా చూసుకుంటున్నారు. ఎంపీపీ పదవికి ముందు ఆమె ఉపాధిహామీ పనులకు సైతం వెళ్లేవారు. ప్రస్తుతం దాబాకు వచ్చే కస్టమర్లకు వడ్డించే పనిలో నిమగ్నమయ్యారు. 'ప్రజలు ఐదేళ్లపాటు అప్పగించిన పనిని నిస్వార్థంగా పూర్తి చేశాను.. ప్రస్తుతం కుటుంబ పోషణ కోసం దాబా ఏర్పాటు చేసుకున్నాం.. కష్టపడటంలో ఎంతో ఆత్మసంతృప్తి ఉంటుంది' అంటున్నారామె. – కందుకూరు

దోమ: గొట్లచెల్కతండాలో వైకుంఠ ధామాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు(ఫైల్)



మొబైల్ షాపు నడుపుతూ ..



వెల్దాల్‌కు చెందిన ఎండీ ముజిబర్ రెహ్మాన్ మొబైల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తుండేవారు. రాజకీయ అరంగేట్రం చేసి పేదలను ఆదుకుంటూ అనతికాలంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఫలితంగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడిగా పదవి వరించింది. నాటి నుంచి నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందించే వారు. జెడ్పీ సమావేశాల్లో స్థానిక సమస్యలు దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేసేవారు. ఇటీవల పదవీ కాలం ముగియడంతో తిరిగి తన మొబైల్ షాపుపై దృష్టి సారించారు. సెల్‌ఫోన్లు విక్రయిస్తూ, రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. – తలకొండపల్లి

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

● కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం కొడంగల్ మున్సిపల్ పరిధిలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పట్టణంలోని వడ్డెరు గల్లీలోని ఒక కుటుంబంతో మాట్లాడారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లు వస్తుందా, గ్యాస్ సబ్సిడీ అమలవుతోందా అని అడిగారు. విద్యుత్ జీరో బిల్లు వస్తోందని లబ్ధిదారులు తెలిపారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడుతున్నాయో లేదో చూసుకోవాలన్నారు. రాని పక్షంలో అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం పట్టణంలో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాల్వలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపాలిటీ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అర్హులకు గృహజ్యోతి పథకం వర్తించేలా, గ్యాస్ సబ్సిడీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

● డీఈఓ రేణుకాదేవి

బంట్వారం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈఓ రేణుకాదేవి హెచ్చరించారు. శనివారం కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటి దగ్గర ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, పిల్లల్ని ప్రైవేటు బడుల్లో కాకుండా సర్కారు పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. నామ్‌కే వాస్తేగా విధులు నిర్వహిస్తే కుదరదన్నారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులకు ఆమె దిశానిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పంపిణీపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈఓ చంద్రప్ప, పాఠశాల కమిటీ చైర్మన్లు శాంతమ్మ, ఉమాదేవి పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

- రూ.7.95 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: దొంగనోట్లు చలామణి చేస్తున్న ఓ ముఠాను పట్టుకుని, వారి నుంచి రూ.7.95 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో మండిగి చంద్రయ్యను పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నివాసం ఉండే ఈయన నాపరాతి వ్యాపారం చేస్తున్నాడు. చంద్రయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద రూ.45 వేలు (తొంభై రూ.500 నోట్లు) స్వాధీనం చేసుకున్నారు. అనతంరం వివరాలు అడగగా మరో ముగ్గురి పేర్లు చెప్పాడు. ఈ మేరకు శనివారం దుండిగల్ పీఎస్ పరిధి ఎస్‌ఆర్‌ఎస్ వృషభాద్రి అపార్ట్‌మెంట్‌లో ఇచ్చాపురం జగదీశ్, బడుగంటి వీర వెంకటరమణ, ప్రగల్లపాటి శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 7.50 లక్షల నకిలీ కరెన్సీ (రూ.500 నోట్లు)ని పట్టుకున్నారు. నోట్ల తయారీకి వినియోగించిన కంప్యూటర్, సీపీయూ, ప్రింటర్, పేపర్లు, రిబ్బన్, 5 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు.

నేరాల బాటలో మాజీ బీఎం జగదీశ్

నిందితుల్లో ఒకడైన జగదీశ్ గతంలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో జహీరాబాద్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేశాడు. బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసిన కేసులో అరెస్టు అయి నెల రోజుల పాటు సంగారెడ్డి జైలులో ఉన్నాడు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పాత నేరస్తుడు వెంకటరమణ

అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండల వాసి అయిన బడుగంటి వీర వెంకటరమణపై గతంలో రాంచంద్రాపురంలో నకిలీ నోట్ల చలామణి కేసు నమోదైంది. సైబరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదు కాగా, 3నెలల పాటు సంగారెడ్డి జైలులో ఉన్నాడు. ఈ సమయంలోనే ఇతనికి జగదీశ్‌తో పరిచయం ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇతనిపై గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైంది. మరో నిందితుడైన శివకుమార్ తూర్పుగోదావరి జిల్లా కిర్లంపుడిలో ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. పై నలుగురిని రిమాండ్‌కు తరలిలిస్తున్నామని ఎస్పీ తెలిపారు.


నకిలీ కరెన్సీ చూపిస్తున్న ఎస్పీ

కఠిన చర్యలు తీసుకుంటాం

నకిలీ నోట్ల చలామణి చేసే వారిపై కఠిన చర్యలు చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. నిరక్షరాస్యులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, రద్దీగా ఉండే వ్యాపార సముదాయాలను లక్ష్యంగా చేసుకుని నేరస్తులు దొంగనోట్లను చలామణి చేస్తుంటారని, వీరి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ కరెన్సీపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి, సహకరించాలని కోరారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న సీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ శ్రీరాములు, సిబ్బంది అంజద్, శివకుమార్, సాయప్ప, షబీల్, ప్రభులింగంకు రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

శుభాకాంక్షలు..


గురునాథ్‌రెడ్డితో కలెక్టర్ తదితరులు

కొడంగల్: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్ జైన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గురునాథ్, కలెక్టర్ జైన్ ఇరువురు తొలిసారిగా కలవడంతో ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం సన్మానించుకున్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టీస్టాల్ దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారు రసూల్‌పూర్ వద్ద ఉన్న ఎల్లోస్టోన్ టీస్టాల్ శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ప్రమాదాన్ని పసిగట్టిన స్థానికులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

కొనసాగుతున్న అధికారుల బదిలీ

మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డికి స్థానచలనం



తాండూరు: అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కేవీఎన్‌మూర్తితో పాటు డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, అనస్థీషియా వైద్యులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు 13 మంది వరకు ప్రభుత్వం బదిలీ చేసినట్లు సమాచారం. మాతాశిశు ఆస్పత్రిలో గైనాకాలజిస్ట్‌లతో పాటు పలువురు వైద్యులకు స్థానచలనం కలిగింది. మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి బదిలీపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా జహీరాబాద్ మున్సిపాలిటీకి వెళ్లారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధరణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణ కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రజలు, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా.. వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వారి సమస్యకు త్వరగా పరిష్కార మార్గం చూపాలని సూచించారు. భూ విస్తీర్ణంలో తప్పులు దొర్లినట్లు దరఖాస్తులు అందినట్లయితే.. వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం శివ శక్తి, వెంకటసాయి రైస్‌మిల్లులను లింగ్యనాయక్ తనిఖీ చేశారు. లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్‌ను వేగవంతం చేయాలని రైస్‌మిల్ నిర్వాహకులకు సూచించారు. ఇచ్చిన గడువులోగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్‌ను చేరవేయాలని, సీఎంఆర్‌ను అందించే విషయంలో అలసత్వం వహించినా, అవకతవకలు జరిగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, పౌరసరఫరా శాఖ డిప్యూటీ తహసీల్దార్ సుగుణ తదితరులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి


పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

ధారూరు: పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శనివారం మండల పరిధి నాగసమందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎన్ని నిధులు మంజూరు అయ్యాయని హెచ్‌ఎం రమేశ్‌ను అడగగా.. వివిధ పనుల కోసం రూ.23 లక్షల వరకు మంజూరు అయినట్లు ఆయన వివరించారు. మధ్యాహ్న భోజనం తయారీలో ఏజెన్సీకి ఇబ్బందిగా ఉందని, వంటగది నిర్మించాలని హెచ్‌ఎం పేర్కొనగా.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని డీఈఓ సమాధానం ఇచ్చారు. మరుగుదొడ్లతో పాటు ప్రహరీ ఎత్తు పెంచాల్సి ఉందని హెచ్‌ఎం.. డీఈఓ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండాలని, ఈ పాఠశాలకు అత్యధిక నిధులు కేటాయించడం వలన కలెక్టర్ పరిశీలించే వీలుందని స్పష్టంచేశారు.

మంత్రి సభలో ప్రొటోకాల్ వివాదం

బడంగ్‌పేట్: మంత్రి సభలో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులను ఒక్కొక్కరిగా వేదికపై ఆహ్వానించారు. మేయర్ పారిజాత ప్రొటోకాల్ పాటించడం లేదంటూ.. అధికారిక కార్యక్రమాలకు ఇతరులను స్టేజీపైకి ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. దీంతో మంత్రిని సన్మానించడానికి వస్తున్నారంటూ మేయర్ సర్దిచెప్పినా వినలేదు. గత ప్రభుత్వం తనను ఇబ్బంది పెట్టినప్పుడు ఏమైంది ప్రొటోకాల్ అని బీజేపీ, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను ప్రశ్నించింది. మంత్రి శ్రీధర్‌బాబు కలుగ చేసుకుని బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అందరూ స్టేజీపైకి రావాలని ఇది మీ కార్పొరేషన్ అని ఆహ్వానించారు. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు స్టేజీ ఎక్కకుండానే వెనుదిరిగారు. అనంతరం సభను యథావిధిగా కొనసాగించారు.


ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

‘అపెక్స్’పై విజిలెన్స్ దాడులు


పరిశ్రమను సీజ్ చేస్తున్న అధికారులు


డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకున్న అధికారులు

- శాంపిళ్లు సేకరించి పరిశ్రమకు తాళం
- పెట్రోల్ పంప్ సీజ్, ట్యాంకర్లు స్వాధీనం

నందిగామ: నకిలీ డీజిల్ తయారు చేస్తున్న ఓ పరిశ్రమ, ఓ పెట్రోల్ పంప్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. నందిగామ శివారు బైపాస్ రోడ్డు సమీపంలో అపెక్స్ బయో ఫ్యూయల్స్ పరిశ్రమలో పలు రకాల క్రూడ్ ఆయిల్స్, రసాయనాలతో నకిలీ డీజిల్ తయారు చేస్తున్నారని సమాచారం అందింది. ఈ మేరకు సివిల్ సప్లై, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి కాపుకాచారు. డీజిల్ ట్యాంకర్ పరిశ్రమ నుంచి బయటకు వెళ్తున్న సమయంలో అధికారులు వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను విచారించారు. అనంతరం పరిశ్రమలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి కెమికల్స్‌తో డీజిల్‌ను కల్తీచేస్తున్నట్లు గుర్తించారు. ఈ డీజిల్‌ను సమీపంలోని ఓ పెట్రోల్ బంక్, ఇతర కంపెనీలకు పంపిణీ చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలుసుకుని 12వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ట్యాంకర్లను సీజ్ చేసి శనివారం స్టేషన్‌కు తరలించారు. అనంతరం పరిశ్రమలోని స్టోరేజీ ట్యాంకర్లలో శాంపిళ్లను సేకరించి ఫ్యాక్టరీని సీజ్ చేశారు. అక్కడ నుంచి పెట్రోల్ బంక్ వెళ్లి శాంపిళ్లు సేకరించి పంప్‌ను సీజ్ చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శశిధర్‌రాజు, డీఎస్‌ఓ ఎంకే రాథోడ్, డీటీలు రవీందర్‌నాయక్, రఘునందన్ తదితరులున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బూత్ స్థాయిలో బలమైన కేడర్ పార్టీ సొంతం
- ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు
- వికారాబాద్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం

అనంతగిరి: బూత్ స్థాయిలో పార్టీ పటిష్టంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి విజయ రామారావు ధీమా వ్యక్తంచేశారు. శనివారం వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలమని, బూత్ స్థాయి వరకు ఏ పార్టీకి లేనంత బలమైన కేడర్ బీజేపీకి ఉందని స్పష్టంచేశారు. మోదీ హ్యాట్రిక్ విజయానికి బూత్ స్థాయి కార్యకర్తలు శ్రమించారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించి, ప్రజలను జాగురతం చేస్తామని మాజీమంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు భారీగా ఓటు బ్యాంకు పెరిగిందని, ఇదే ఊపును స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపాలని పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయరామారావు

క్రమశిక్షణకు మారుపేరు..

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే.. దేశం, ధర్మం కోసం పనిచేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. క్రమశిక్షణకు మారుపేరు పార్టీ శ్రేణులని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వెల్లడించారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా నాయకులు వాటిని బలపర్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు కరణం ప్రహ్లాదరావు, సదానందారెడ్డి, రమేష్ కుమార్, పూనంచంద్ లాహోటి, గిరిమోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కర్‌రెడ్డి, కృష్ణ, రాంచందర్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి కిరణ్, బీసీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, దళితమోర్చా అధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నందు, కోశాధికారి పోకల సతీష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, నియోజకవర్గ నాయకులు వడ్లనందు, రాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ‘ప్రజాపాలన’ కేంద్రం

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు: కలెక్టర్

అనంతగిరి: ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పట్టణాలు, మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చేవారి కోసం ఇక్కడ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి, లబ్ధిపొందని వారు ఎవరైనా ఉంటే.. దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం అర్జీలను పరిశీలించి, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవా కేంద్రం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల సేవలు అందిస్తుందని వెల్లడించారు. కొత్తగా అర్జీ లేక వివరాల సవరణ కోసం వచ్చే వారు తమ వెంటరేషన్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ తీసుకురావాలని సూచించారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

నలుగురికి గాయాలు

మొయినాబాద్: ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లి గేటు సమీపంలో చోటుచేసుకుంది. శనివారం మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్, భార్య విజయ, కొడుకు తిమోతి శుక్రవారం రాత్రి చేవెళ్ల మండలంలోని ఎనికేపల్లిలో నిర్వహించిన ఫంక్షన్‌కు మేడిపల్లికి చెందిన డ్రైవర్ రాజు కారును అద్దెకు తీసుకుని వెళ్లారు. కార్యక్రమం అనంతరం రాత్రి 10 గంటల సమయంలో మేడిపల్లికి వస్తుండగా.. ప్రగతి రిసార్ట్స్ సమీపంలోని మేడిపల్లి గేటు దగ్గరకు రాగానే ఎదురుగా అతివేగం, అజాగ్రత్తతో వచ్చిన కారు, వీరి కారును ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రాజుతో పాటు మల్లేశ్, విజయ, తిమోతిలకు గాయాలయ్యాయి. అతివేగంతో వచ్చి ఢీకొట్టిన కారును ఆపకుండా డ్రైవర్ పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్సకోసం స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం

- కొడంగల్‌లో ఆర్కిటెక్ట్ ఇంజనీర్ పర్యటన
- సమీకృత గురుకులాల ఏర్పాటుకు స్థల పరిశీలన
- వివరాలు వెల్లడించిన ‘కడా’ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా సమీకృత గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ‘కడా’ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ పరిధి పాత కొడంగల్ శివారులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిన ఆర్కిటెక్స్ ఇంజనీర్ అధికారుల బృందం స్థల పరిశీలన చేసిందని ఆయన వెల్లడించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల విద్యాలయాలు ఒకేచోట నిర్మాణం కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారి వివరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సెగ్మెంట్లు కొడంగల్, మధిరలో సమీకృత గురుకులాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని చెప్పారు.


గిరిజన గురుకుల విద్యాలయం పై నుంచి స్థలం పరిశీలిస్తున్న అధికారులు

20ఎకరాల్లో..

ఒకే ప్రహరీలో అన్ని గురుకులాలు ఉండేలా ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణం చేపట్టేందుకు 20ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు కడా అధికారి స్పష్టంచేశారు. ఆర్కిటెక్స్ ఇంజినీర్ అధికారి మనోజ్ తన సహచర అధికారులతో గురుకులాల డిజైన్ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. అనంతరం గురుకులంలోని తరగతి గదుల కొలతలను పరిశీలించారు. పూర్తయిన డిజైన్‌ను ముఖ్యమంత్రి పరిశీలించాక.. పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ హబ్‌కు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం కొరకు గ్రామానికి చెందిన రైతుతో ప్రత్యేకాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఏఈ శ్రీకాంత్, సర్వేయర్ మురళీధర్‌చారి, గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, గ్రామస్తులు రాములు తదితరులు పాల్గొన్నారు.

‘మొక్క’బడిగా చేస్తే సహించేది లేదు

- నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం బాధ్యత పంచాయతీలదే
- కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- డీఆర్‌డీఓ శ్రీలత

కొందుర్గు: నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం పూర్తి బాధ్యత గ్రామ పంచాయతీలదేనని, కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ శ్రీలత హెచ్చరించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని పలు గ్రామాల్లో నర్సరీలను శనివారం సందర్శించడంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం రెండు మండలాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారని, లక్ష్యాన్ని చేరుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. కూలీలకు 100 రోజులు పని కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. కూలీల ఆధార్ అనుసంధానంలోనూ 100 శాతం పూర్తిచేయడం లేదన్నారు. ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు, మండలానికి 50 వేల మొక్కలు నాటాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో 80 రోజులు పూర్తయిన కూలీలను గుర్తించి మొక్కలకు గుంతలు తీయించడం, మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం గుంతలు తీయించాలని, మొక్కుబడిగా చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతి పథకం ద్వారా కూలీలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 100 రోజులు పని పూర్తిచేసిన కూలీలకు ఈ పథకంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మగ్గం వర్క్, టైలరింగ్, అల్లికలు తదితర 80 రకాల కోర్స్‌లపై శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఆమె చౌదరిగూడలో మహిళలు విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుహాసిని, ఏపీడీ సక్రియ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓలు లాలయ్య, విజయ్ కుమార్ పాల్, ఏపీఓలు నర్సింగ్‌రావు, ప్రవళిక పాల్గొన్నారు.


చౌదరిగూడలో విద్యార్థుల యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు